నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | శుక్రవారం 10 నవంబర్ 2023 www.ntnews.com

కేసీఆర్ హ్యాట్రిక్ వీరుడు
దరిదాపుల్లో లేడు ఎవడు
పోరుకు సమఉజ్జీ లేడు
కూడు, గూడు కల్పించినోడు
ప్రజల కష్టాలు తెలిసినోడు
బాగోగులు చూసే తోడు
కన్నీటిని తుడిసేటివాడు
కేసీఆర్ జైత్రయాత్రను ఆపేటివాడు
ఎక్కడ కాన రానే రాడు
కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టి తీరుతాడు చూడు
-గాదిరాజు రంగరాజు

91827 77222
హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

నాడు-నేడు

• దవాఖానకు సుస్తీ...

ప్రాణం బాగాలేనప్పుడు, దవాఖానకు పోతే ధైర్యం రావాలి. కానీ, అప్పటి ఆసుపత్రులను చూస్తే మంచి వాళ్లకే రోగం వచ్చేలా ఉండేది. మురికిపట్టిన పాత గోడలు, సౌకర్యం లేని గదులు, కొరవడిన వైద్య సదుపాయాలు... ఇదీ వీటి పరిస్థితి. పాతికేండ్ల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిత్రం ఇది. కేవలం ఎనిమిది పడకలతో కట్టిన దీన్ని జనాభా సంఖ్యకు తగ్గటు ఆధునీకరించాలన్న ఆలోచన కూడా చేయలేదు అప్పటి సర్కారు.

• వైద్యానికి చికిత్స...

ఆరోగ్య తెలంగాణనే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు వెళుతున్నది. ప్రజలకు కావలసిన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేలా సర్కారు దవాఖానలను తీర్చిదిద్దుతున్నది. ఇందులో భాగంగానే కాగజ్‌నగర్‌లోనూ రూ.5 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. 30 పడకలు, అధునాతన స్కానింగ్ పరికరాలు సహా అన్ని వసతులతో దవాఖాన అందుబాటులోకి వచ్చింది. ఇక, ఈ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఏ సుస్తీ చేసినా క్షణాల్లో వైద్యం అందుతున్నది.

సామాన్యుల మాట

గొర్రెలు నాలుగింతలైనయ్

నా శిన్నతనంలో దొడ్డి నిండా గొర్రెలున్నయంటే ఆస్తిపరులు అనేటోళ్లు. గొర్రెల కాసుకుంటూ బతికే టోళ్లకు ఏ సర్కారు గూడ ఇంతపరకూ ఏ పన్జెయ్యలే. నా యాదిలో గొల్లకుర్మలను పట్టించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కడే. మా ఊర్లో మొత్తం 22 మంది కాపర్లుంటే మొదటి కిస్తీలో 11 మందికి గొర్లు వొస్తే తలా ఇన్ని పంచుకున్నం. ఇప్పుడు రొండోసారి వొస్తే మనిషికిన్ని పంచుకోవాలె. సర్కారు ఇచ్చిన గొర్రెలు మంచిగనే పాణం బట్టి ఉన్నయ్. ఆరునెల్లకో ఈతతో ఒక గొర్రెకు నాలుగు గొర్రెలైనయి. ఇంటి సంసారానికి,అప్పు తిప్పలకు గొర్రెలమ్ముకొని బతుకుతున్నం. గొల్లకుర్మల గురించి ఆలోచన జేసిన కేసీఆర్ సారును ఎన్నటికీ మరువం.

– మొగుళ్ల శంకర్,
శేరిపల్లి, సిద్దిపేట జిల్లా

గొర్రెల పంపిణీ పథకం

ప్రారంభం: 2017

సబ్బండ వర్గాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడంతో పాటు కులవృత్తులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి రూ.1,100 కోట్లతో తెలంగాణ సర్కారు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో పశుసంపద గణనీయంగా పెరిగింది. పథకం ప్రారంభించిన మొదటి విడుతలోనే 82.64 లక్షలకు పైగా గొర్రెలను పంపిణీ చేయడం రికార్డు.

జహీరాబాధ తీర్చలే

గీతారెడ్డితో గింతంత అభివృద్ధి
మాణిక్‌రావుతో మస్తు ప్రగతి

12 సార్లు కాంగ్రెస్‌ను గెలిపించిన జహీరాబాద్ • 2014 వరకు అన్నింటా వెనుకబడ్డ నియోజకవర్గం

కేసీఆర్ సర్కార్ వచ్చినంకనే మొదలైన అభివృద్ధి • పరిశ్రమలకు కేంద్రంగా మారుతున్న జహీరాబాద్

కాంగ్రెస్ పార్టీని నమ్మితే నట్టేట మునిగినట్టే అని చెప్పడానికి సరైన ఉదాహరణ జహీరాబాద్ నియోజకవర్గం. ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఏండ్ల తరబడి గుడ్డిగా నమ్మారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ బతుకులు బాగుపడతాయని భ్రమపడ్డారు. వాళ్ల ఓట్లతో గెలిచిన నాయకులు బాగుపడ్డారు కానీ, ప్రజలు మాత్రం దగా పడి గోసపడ్డారు. ఇక్కడ గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రులు అయ్యారు కానీ, ప్రజలకు మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కాంగ్రెస్‌ను నమ్మినందుకు జహీరాబాద్ అన్నింటా వెనుకబడ్డది.

కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంకనే జహీరాబాద్ ప్రగతి జోరుగా కొనసాగుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రాంత కష్టాలను, గత పాలకుల వల్ల ఈ నియోజకవర్గానికి జరిగిన నష్టాన్ని స్వయంగా చూశారు. దీంతో అధికారంలోకి రాగానే అభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం సంగమేశ్వర ఎత్తిపోతలను నిర్మిస్తున్నది. నిమ్జ్ ఏర్పాటు అవుతున్నది. మరెన్నో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది.

నియోజకవర్గానికి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 12 సార్లు గెలిచింది. 2009, 2014లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ నుంచి గీతారెడ్డి గెలిచారు. కాంగ్రెస్ హయాంలో ఆమె మంత్రిగా కూడా పనిచేశారు. కాని అభివృద్ధిపై దృష్టిపెట్టలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన సీఎం కేసీఆర్ జహీరాబాద్ ప్రాంత కష్టాలను, గత పాలకుల వల్ల ఈ నియోజకవర్గానికి జరిగిన నష్టాన్ని స్వయంగా చూశారు. అధికారంలోకి రాగానే అభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. ఇవి చూసిన ప్రజలు గత ఎన్నికల్లో 34 వేల భారీ మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావును గెలిపించారు. ఆయన ఎమ్మెల్యే అయ్యాక గత ఐదేండ్ల నుంచి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్నది.

జోరుగా పారిశ్రామిక అభివృద్ధి..

ఉమ్మడి రాష్ట్రంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన గీతారెడ్డి ఇక్కడికి పరిశ్రమలు తీసుకురావడంలో విఫలమయ్యారు. కేసీఆర్ ప్రభుత్వం ఇక్కడికి పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకువస్తున్నది. 12,635 ఎకరాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్(నిమ్జ్) ఏర్పాటు అవుతున్నది. రూ.1000 కోట్లతో వెమ్ టెక్నాలజీ అనే డిఫెన్స్ పరిశ్రమను ప్రభుత్వం ఇక్కడికి తీసుకువచ్చింది. రూ.1000 కోట్లతో మహీంద్రా పరిశ్రమ విస్తరణ జరుగుతున్నది. ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలను తీసుకువస్తున్నది. ట్రైటాన్ కంపెనీ రూ.2100 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నది. రూ.1500 కోట్ల పెట్టుబడితో ఆటోమొబైల్ పరిశ్రమ ఏర్పాటవుతున్నది. కోహీర్ మండలం వెంకటాపూర్‌లో 1,009 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది.

లక్ష ఎకరాలకు సాగునీరే లక్ష్యం..

దశాబ్దాల నుంచి ఈ ప్రాంతం కరువుతో అల్లాడిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం జహీరాబాద్‌ను సస్యశ్యామలం చేసేందుకు అడుగులు వేస్తున్నది. రూ.2,653 కోట్లతో సంగమేశ్వర ఎత్తిపోతలను నిర్మిస్తున్నది. దీంతో 1,03,259 ఎకరాలకు సాగునీరు అందనున్నది. మిషన్ కాకతీయ ద్వారా రూ.31.04 కోట్లతో 278 చెరువులను పునరుద్ధరించడంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఇక సాగు,తాగునీటికి ఢోకాలేదు.

మాణిక్‌రావు ఎమ్మెల్యే అయ్యాక జరిగిన ముఖ్యమైన అభివృద్ధి పనులు..

- రూ.50 కోట్లతో జహీరాబాద్ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు.
- గ్రామానికి రూ.20 లక్షల చొప్పున138 గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.
- జహీరాబాద్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడింది. పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు.
- రూ.69 కోట్లతో 1,060 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేశారు.
- నిజాంపేట –బీదర్ నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.540 కోట్లు మంజూరు.
- జహీరాబాద్‌లో 100 పడకల దవాఖాన, మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణం.
- మిర్జాపూర్, కోహీర్‌లో కొత్తగా 50 పడకల దవాఖానల నిర్మాణం.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ఏర్పాటు.

ఫన్‌టాస్టిక్



పేర్లు మారుస్తాం... పేర్లు మారుస్తాం...

'నామినేషన్ల గడువు ముగుస్తున్నది. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నది. అధికార పక్షం ప్రచారంలో దూసుకెళ్తున్నది ... ఇప్పటికీ మన పువ్వు పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేయలేదు. జనం నవ్వుకుంటున్నారు సార్ ...'

'నవ్వుకోనియ్యవోయ్ ...'

'జనం నవ్వుతున్నారు ... మన క్యాడర్ ఏడుస్తున్నారు సార్'

'జరగని పెళ్ళికి బాజాల హడావుడి... అని నవ్వినా ఏడ్చినా, ఏది ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతుంది.'

'మీ సామెత వేరే అర్థాన్ని సూచిస్తుంది ... ఎలాగూ గెలిచి చచ్చేది లేదు ... ఎన్నికల ప్రణాళిక ఎందుకు అని చెబుతున్నట్టుగా ఉంది...'

'హా ... హా ... భలే చెబుతావు. ఎన్నికల మ్యానిఫెస్టోలో మనకు పెద్ద ప్లాన్ ఉంది. చివరి నిమిషం వరకు రహస్యంగా ఉంచాలి... పోలింగ్ ముందు విడుదల చేస్తే అంతా ఆశ్చర్యపోవలసిందే'

'ఎన్నికల ప్రణాళికలో అంత అద్భుత విషయాలు ఏమున్నాయి సార్. కాళేశ్వరం, రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్ట్‌లను జాతీయ ప్రాజెక్టులుగా ప్రకటిస్తామని చెబుతారా?'

'కాదు ... అంతకన్నా గొప్పవి...'

'బయ్యారం స్టీల్ ప్రకటిస్తారు నాకు తెలుసు ...'

'అది కాదోయ్ ...'

'వీటికన్నా గొప్ప ప్రాజెక్ట్‌లు అంటే ఊహించ లేక పోతున్నాను మీరే చెప్పండి సార్ ...'

'ప్రపంచంలో ఎవరూ ఊహించనివి...'

'ఊరించకుండా మీరు ప్రకటించే వరాలు ఏమిటో చెప్పండి'

'ఒక వ్యక్తి పేరు మార్చుకోవాలి అంటే ఎంత కష్టమో నీకు తెలుసా?'

'ఎందుకు తెలియదు. బాగా తెలుసు... తల ప్రాణం తోకకు వస్తుంది. పత్రికలో ప్రకటన వేయించాలి. గెజిట్‌లో నోటిఫికేషన్ రావాలి ... చాలా కష్టం...'

'కదా .... మేం అధికారంలోకి వస్తే అన్ని పేర్లూ మార్చేస్తాం. గ్రామాలు, మండలాలు, జిల్లాలు చివరికి రాష్ట్రం పేర్లు కూడా మార్చేస్తాం. నువ్వు కలలో కూడా ఊహించవు. ప్రాంతాల పేర్లే కాదు ప్రతి మనిషి పేరు ఉచితంగా మార్చేస్తాం ... ఔను తమ్ముడు నీ పేరేంటి?'

'వద్దులెండి ... నా పేరు ఇలానే ఉండనివ్వండి'

'పేర్లు మారుస్తాం .... పేర్లు మారుస్తాం ... రండి బాబూ రండి ... ఎలా ఉంది నినాదం'

'మాట్లు వేస్తాం .... మాట్లు వేస్తాం అని అరిచినట్టుగా ఉంది'

'నాదో ఐడియా. ఈ పేర్లు మార్చే వరం ఏదో గుజరాత్‌కు ఇచ్చి ... గుజరాత్‌కు ఇస్తున్న ప్రాజెక్ట్‌లు తెలంగాణకు మార్చొచ్చు కదా?'

'గుజరాతీ బాస్‌లు ఒప్పుకోరు...'

'అందుకే అన్న ప్రజలు పేర్లు మార్చే మనల్ని నమ్మడం మానేసి , తల రాతలు మార్చే పార్టీని నమ్ముకున్నారు'.

■ మురళి

ద లీడర్..

శాంతమూర్తి.. నిరంతర శ్రామికుడు

కార్మిక క్షేత్రంలో 'కొప్పుల' సేవ • కార్మికుడి నుంచి కేబినెట్ మినిస్టర్‌గా.. ఆరుసార్లు ఎమ్మెల్యేగా రికార్డు • పల్లె నిద్రతో ప్రజల్లోకి..

ప్రజాక్షేత్రమే ఆయన ఇల్లు. సమస్యల పరిష్కారమే ఆయన లక్ష్యం.. ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నాననే భరోసా.. కోపం దరిచేరని శాంతమూర్తి. నిరంతర శ్రామికుడు. సింగరేణి కార్మికుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి ప్రభుత్వ చీఫ్ విప్‌గా.. రాష్ట్ర మంత్రిగా ఎదిగిన ప్రజ్ఞాశాలి. ఉద్యమకారుడిగా, కార్మిక క్షేత్రంలో గులాబీ జెండాను రెపరెపలాడించారు. కేసీఆర్ వెన్నంటే ఉండి, అత్యంత నమ్మకస్తుడిగా రాష్ట్రసాధనకు తనవంతు పాత్రను పోషించారు.. ఆయనే కొప్పుల ఈశ్వర్.

ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ తన తల్లిదండ్రుల పేరిట ఎల్ఎమ్ కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యపరీక్షలు, చికిత్సలు చేయించారు. నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహించి దాదాపు 2వేల మందికి ప్రైవేటుగా ఉద్యోగావకాశాలు కల్పించారు. పేదింటి యువతుల వివాహాలకు ఆర్థిక సాయం చేస్తున్నారు. అందరూ ఆయనను ఆత్మీయంగా ఈశ్వరన్నా అని పిలుస్తారు.

ఓటమెరుగని విజేత..

ఈశ్వర్ స్వస్థలం పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి మండలంలోని కుమ్మరికుంట. 27ఏండ్లు సింగరేణి కార్మికుడిగా పనిచేశారు. రాజకీయాలపై ఆసక్తితో అనేక పదవులు నిర్వహించారు. ఉద్యమపార్టీలో చేరి.. 2004లో మేడారం నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి వెనుదిరగకుండా మేడారం, ధర్మపురి నియోజకవర్గాల నుంచి అప్రతిహత విజయాలను నమోదుచేస్తున్నారు. ఇప్పటి వరకు ఆరుసార్లు గెలిచి కొప్పుల రికార్డు సృష్టించారు. ఉద్యమనేత కేసీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, 2008 ఉపఎన్నికలో మేడారం నుంచి గెలిచి తన సత్తాను నిరూపించుకున్నారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనతో ధర్మపురి నియోజకవర్గానికి మారి అక్కడా గెలిచారు. 2009 సాధారణ ఎన్నికల్లో, 2010లో ధర్మపురి నుంచి ఎన్నికయ్యారు. 2014లో ధర్మపురి నుంచి గెలిచి శాసనసభలో చీఫ్‌విప్‌గా సేవలందించారు. ఆ తర్వాత 2018లోను ఆరోసారి విజయదుందుభి మోగించి కేసీఆర్ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగుతున్నారు.

మన ఊర్లో – మన ఎమ్మెల్యే..

ప్రజా సమస్యల పరిష్కారానికి కొప్పుల ఈశ్వర్ వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. 'మన ఊర్లో –మన ఎమ్మెల్యే' పేరుతో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. 50, 30 పడకల దవాఖానలను నిర్మించారు. డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. ధర్మపురి టెంపుల్ సిటీకి వంద కోట్లను విడుదల చేయించారు.ఈ ఐదేండ్లల్లో రూ.1500 కోట్లతో మౌలిక వసతులు చేపట్టారు.